సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



ఏఓబీలో చెక్‌పోస్టు

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఏఓబీ ప్రాంతమైన పాతపట్నంలో పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. - 8లో



వివాహమైన 8 నెలలకే..

ఓ వివాహిత పెళ్లయిన ఎనిమిది నెలలకే మృతి చెందింది. కారణాలు తెలియాల్సి ఉంది. - 8లో

ఓపెన్ ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి ఆహ్వానం

ఇచ్ఛాపురం: పదో తరగతి ఉత్తీర్ణులైన వారు, ఇంటర్మీడియట్‌ను మధ్యలో మానేసిన వారికి ఇంటర్మీడియట్ విద్యార్హతను పూర్తి చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం అవకాశం కల్పించిందని ఇచ్ఛాపురం ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ పి.రజనీకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశానికి ఈ నెల 27లోగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సమీప కళాశాలల్లో సంప్రదించాలని సూచించారు.

అభిమానం మెండుగా.. మండలి నిండుగా!

సిక్కోలుపై వరాల వర్షం కురుస్తోంది. పదవులు వరించి వస్తున్నాయి. జిల్లా రాజకీయ చరిత్రలోనే నభూతో నభవిష్యతి అన్న రీతిలో ఒకే ప్రభుత్వ హయాంలో రికార్డ్ స్థాయిలో నాలుగు ఎమ్మెల్సీ పదవులు నడుచుకుంటూ వచ్చాయి. కాంగ్రెస్ పాలనలో పలువురు జిల్లావాసులు ఎమ్మెల్సీ పదవులు పొందినా వేర్వేరు ప్రభుత్వాల హయాంలో లభించాయి. గత టీడీపీ ప్రభుత్వంలో ఇద్దరికీ ఆ పదవులు ఇచ్చినా అందులో ఒకటి విజయనగరం జిల్లాకు చెందిన శత్రుచర్లకు శ్రీకాకుళం కోటాలో కట్టబెట్టారు. కానీ జగన్ ప్రభుత్వం సామాజిక సమతుల్యానికి పెద్దపీట వేస్తూ నలుగురికి అవకాశమిచ్చి జిల్లా పట్ల తన ప్రేమాభిమానాలను చాటుకుంది.

- ఒకే ప్రభుత్వంలో జిల్లాకు నాలుగు ఎమ్మెల్సీలు
- సామాజికవర్గాలకు సముచిత స్థానం
- సిక్కోలుపై తరగని జగన్ అభిమానం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిక్కోలుపై మరోసారి ప్రేమ చూపించారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఒకే టర్మ్‌లో జిల్లా నుంచి నలుగురికి ఎమ్మెల్సీ పదవులు కేటాయించి అభిమానం చాటుకున్నారు. సామాజిక సమతుల్యతకు పెద్దపీట వేస్తూ వెనుకబడిన వర్గాలకు అండగా నిలిచారు. చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్న కాలంలో జిల్లాలో ఒకే ఒక్కరికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. అది కూడా రెండేళ్ల కాల పరిమితి ఉన్న ఎమ్మెల్సీ పదవిని సీనియర్ నేత, మాజీ స్పీకర్ ప్రతిభా భారతికి కట్టబెట్టారు. 2014–19 సమయంలో మెజారిటీ సభ్యులుండటంతో సహజంగానే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవి వస్తోంది. దానిని శ్రీకాకుళం జిల్లా నేతలకు కాకుండా విజయనగరం జిల్లాకు చెందిన మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజుకు ఇచ్చారు. వీరిద్దరూ గతంలో చట్టసభల్లో పనిచేసిన వారే. చంద్రబాబు కొత్తగా చట్టసభలకు పంపించిందేమి లేదు. తనకు రాజకీయంగా కీలక సమయంలో ఉపయోగపడ్డ వారికే ఎమ్మెల్సీ పదవులు కట్టబెట్టారు. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం నలుగురికి ఎమ్మెల్సీ పదవులిచ్చారు. ఇంతవరకు చట్టసభలకు వెళ్లని కొత్త వారికే పదవులిచ్చారు. దువ్వాడ శ్రీనివాస్, పాలవలస విక్రాంత్, వరుదు కళ్యాణి, తాజాగా నర్తు రామారావు కీలక పదవులు పొందారు. ఆ పదవులు కూడా ఏదో చేతులు దులుపుకునే ప్రయత్నంలా కాకుండా పూర్తి పదవీ కాలానికి సంబంధించినవి. వెనకబడిన సామాజిక వర్గాలకు అండగా నిలిచే ఉద్దేశంతో ఎమ్మెల్సీ పదవులిచ్చి తొలిసారి చట్టసభల్లో అడుగు పెట్టే అవకాశం కల్పించారు.


దువ్వాడ శ్రీనివాస్


పాలవలస విక్రాంత్



వరుదు కళ్యాణి


నర్తు రామారావు



జిల్లా చరిత్రలో రికార్డు..

మండలి వ్యవస్థ ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు ఒకే ప్రభుత్వంలో జిల్లాకు చెందిన నలుగురికి ఎమ్మెల్సీ పదవులిచ్చిన సందర్భాల్లేవు. గతంలో కాంగ్రెస్ తరఫున స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పలువురు పనిచేశారు. మరో ఇద్దరు ఎమ్మెల్యే, గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమితులయ్యారు. వారంతా వేర్వేరు ప్రభుత్వాల్లో ఎమ్మెల్సీలయ్యారు. కానీ, ఒకే ప్రభుత్వంలో నలుగురికి ఎమ్మెల్సీలు ఇవ్వడం ఇదే తొలిసారి. జిల్లా చరిత్రలో ఇదొక రికార్డుగా చెప్పుకోవచ్చు. ఈ జిల్లాలోనే కాదు మిగతా జిల్లాల్లో కూడా ఇటువంటి రికార్డు గతంలో లేదు. సిక్కోలుపై సీఎం జగన్‌కున్న ప్రేమ ఎలాంటిదో ఎమ్మెల్సీ పదవుల కేటాయింపుల ద్వారా మరో సారి స్పష్టమైంది.



సామాజిక సమతుల్యత

జిల్లాలో కీలక సామాజిక వర్గాలన్నింటికీ పదవుల నియామకాల్లో ప్రాధాన్యం కల్పించారు. నామినేటెడ్ పదవుల విషయానికొస్తే కాళింగ, తూర్పు కాపు, కళింగ వైశ్య, రెడ్డిక, యాదవ, మత్స్యకార, ఎస్సీ తదితర సామాజిక వర్గాలకు పెద్దపీట వేశారు. రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులతో పాటు జిల్లా స్థాయిలో ప్రధాన పదవులు కేటాయించారు. వీటికి తోడు ఎమ్మెల్సీ పదవులను భర్తీ చేశారు. తొలుత కాళింగ సామాజిక వర్గానికి చెందిన దువ్వాడ శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ చేశారు. ఆ తర్వాత తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన పాలవలస విక్రాంత్‌ను ఎమ్మెల్సీగా నియమించారు. తదుపరి వెలమ సామాజిక వర్గానికి చెందిన వరుదు కళ్యాణిని ఎమ్మెల్సీగా నియమించారు. తాజాగా యాదవ సామాజికవర్గానికి చెందిన నర్తు రామారావును స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కింద నిలబెట్టారు. దీన్నిబట్టి జిల్లాలో ఉన్న ప్రధాన సామాజిక వర్గాలకు రాజ్యాధికారం అందించి ప్రత్యేక గౌరవం కల్పించినట్లయ్యింది. ఎమ్మెల్సీగా నియమితులైన వారంతా కొత్తగా చట్టసభల్లో అడుగు పెట్టిన వారు కావడం విశేషం. వైఎస్ జగన్ చొరవతో ఆయా సామాజిక వర్గాల నేతల కల సాకారమైంది.

న్యూస్‌రీల్

తోటల పెంపకానికి స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

బూర్జ : మండలంలోని పెద్దపేట ఉద్యాన పరిశోధన స్థానంలో తోటల పెంపకానికి సంబంధించి డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధన స్థానం సంచాలకుడు డాక్టర్ నారంనాయుడు బుధవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొబ్బరి అభివృద్ధి బోర్డు ఆర్థిక సహాయంతో త్వరలో కొబ్బరి న్యూక్లియస్ విత్తన అభివృద్ధి కింద వివిధ రకాల కొబ్బరి మొక్కలు నాటేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విజయవాడ కొబ్బరి అభివృద్ధి బోర్డు డిప్యూటీ డైరెక్టర్ కుమారవేల్, పెద్దపేట ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త బి.వి.కె.భగవాన్, ఉద్యాన పరిశోధనా అధికారి డాక్టర్ ఆర్.వి.వి.ప్రసాద్, డీహెచ్‌ఓ ఆర్.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం సీజ్


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో విజిలెన్స్ ఎస్సై రామారావు

ఎల్.ఎన్.పేట: మండలంలోని చొర్లంగి గ్రామంలో ఎం.సూర్యనారాయణ ఇంటి పక్కన ఉన్న పశువుల షెడ్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 10 టన్నుల 315 కేజీల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నామని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై బి.రామారావు తెలిపారు. రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉన్నాయన్న సమాచారం మేరకు విజిలెన్స్ ఎస్పీ ఎ.సురేష్‌బాబు సూచనల మేరకు బుధవారం దాడులు నిర్వహించామన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని వీఆర్వో సింహాచలానికి అప్పగించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎల్.ఎన్.పేట సీఎస్‌డీటీ డబ్బీరు రామకృష్ణ, విజిలెన్స్ హెచ్‌సీ రామ్మోహన్‌రావు, పీసీ ఈశ్వరరావు, శేషగిరి పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి రూ.38 లక్షలు


ధనలక్ష్మికి బీమా చెక్కును అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని ఆదివారంపేట కూడలిలో గత ఏడాది అక్టోబర్ 18న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమదాలవలస పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తించిన సనపల రామారావు మరణించిన సంగతి తెలిసిందే. ఇతని కుటుంబానికి మంజూరైన రూ.38 లక్షల ప్రమాద బీమా చెక్కును ఎస్పీ జి.ఆర్.రాధిక బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో యాక్సిస్‌బ్యాంకు ప్రతినిధుల సమక్షంలో రామారావు భార్య ధనలక్ష్మికి అందజేశారు. పిల్లల ఉన్నత చదువుల కోసం నగదు ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ఎం.శివరామరాజు, పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంబీఏ విద్యార్థికి రూ. 11 లక్షల ప్యాకేజ్

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీ శివానీ కాలేజ్ ఎంబీఏ విద్యార్థి జమ్మాన సుధీర్‌కుమార్‌కు రూ.11 లక్షల వార్షిక ప్యాకేజ్ లభించింది. ముంబైకి చెందిన మింటిఫి సంస్థ ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఇంటర్వ్యూలో క్లౌడ్ ఆపరేషన్ మేనేజర్‌గా ఎంపికయ్యాడు. ఈ విద్యార్థిని బుధవారం మేనేజ్‌మెంట్ సభ్యులు పెనుమత్స దుర్గాప్రసాద్ రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.టి.చంద్రశేఖర్, టీపీఓ బి.ప్రసాదరావు, ఎంబీఏ విభాగాధిపతి కె.రవికుమార్ అభినందించారు.


సుధీర్‌కుమార్‌ను అభినందిస్తున్న యాజమాన్యం, సిబ్బంది

నెలాఖరులోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రబీ సీజన్‌లో పంటలు సాగుచేస్తున్న రైతులు ఈ-క్రాప్ నమోదు, ఈకేవైసీని ఈ నెల 28లోగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన సహాయకులను సంప్రదించి పంటల వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. పంటల బీమా పథకం, సున్నావడ్డీ పంట రుణాలు, పెట్టుబడి రాయితీ, రైతుభరోసా, పంట ఉత్పత్తులు కొనుగోలు వంటి పథకాలు పొందాలంటే తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు.

కంచి కామకోటి పీఠాధిపతికి ఘన స్వాగతం


భారీ పూలమాలతో స్వాగతం పలుకుతున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామికి జిల్లా కేంద్రంలోని బాల త్రిపుర కాలభైరవ(పీఠం) దేవాలయం ఆధ్వర్యంలో భక్తులు బుధవారం ఘన స్వాగతం పలికారు. నవభారత్ కూడలి నుంచి నగరానికి తీసుకొచ్చి స్వామీజీని సప్త అశ్వాల రథంపై ఊరేగించారు. మహిళలు కలశాలతో వెంట రాగా.. భక్తులు సాదరంగా స్వామీజీని ఆహ్వానించారు. అనంతరం ఆలయంలో భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు.

నామినేషన్ల సందడి

- శ్రీకాకుళం స్థానిక సంస్థల వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా నర్తు రామారావు
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం జిల్లా స్థానిక సంస్థల శాసన మండలి పదవికి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పార్టీ సీనియర్ నేత నర్తు రామారావు బుధవారం నామినేషన్ వేశారు. కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఏఆర్‌ఓ, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరిలకు నామినేషన్ పత్రాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, నర్తు చామంతి, నర్తు నరేంద్రలు రామారావు నామినేషన్‌కు ప్రతిపాదించారు. అంతకు ముందు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులతో ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఇచ్ఛాపురం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

- ఇప్పటి వరకు స్థానిక సంస్థల శాసన మండలి సభ్యుని ఎన్నికకు సంబంధించి ఒక నామినేషన్ మాత్రమే దాఖలైంది. గడువు తేదీ ఈ నెల 23(గురువారం మధ్యాహ్నం 3 గంటలు)లోగా నామినేషన్ వేసేందుకు అవకాశం ఉంది.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి ఒక్కరోజే 12 నామినేషన్లు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు బుధవారం 12 మంది అభ్యర్థులు విశాఖ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు నామినేషన్ పత్రాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్, టీడీపీ మద్దతు అభ్యర్థిగా వేపాడ చిరంజీవిరావు, బీజేపీ మద్దతు అభ్యర్థిగా పి.వి.ఎన్.మాధవ్ నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ రెబల్ అభ్యర్థిగా ఈర్లె శ్రీరామమూర్తి, స్వతంత్ర అభ్యర్థులుగా విజయనగరం జిల్లా రాజాంకి చెందిన పురిపండ శ్రీనివాసరావు, విశాఖ జిల్లాకు చెందిన గుండుపల్లి సతీష్, వేపగుంటకు చెందిన దండేల ఆనందరావు, ఆరిలోవకు చెందిన బలివాడ రామ సంతోష్, మధురవాడకు చెందిన జి.విజయకుమార్, గవరపాలెంకి చెందిన ఆడారి శరత్ చంద్ర, సోంపేటకు చెందిన కొళ్ల లోకనాథం, మెళియాపుట్టికి చెందిన రాజానమోహన్‌రావు నామినేషన్లు దాఖలు చేశారు. బుధవారం నాటికి 18 మంది అభ్యర్థులు 27 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.


నామినేషన్ దాఖలు చేస్తున్న నర్తు రామారావు


నామినేషన్ దాఖలు చేస్తున్న వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్

అభివృద్ధి, సంక్షేమమే విజయానికి సోపానాలు

- టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ గెలుపునకు సోపానాలుగా నిలుస్తాయని టీటీడీ చైర్మన్, పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ మద్దతుతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. అంతకు ముందు రుషికొండలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, సంపత్ వినాయక ఆలయంలో పూజలు చేశారు. వందలాది మంది వైఎస్సార్ సీపీ శ్రేణులతో ఐదు కిలోమీటర్ల మేర కారు, బైక్‌ల ర్యాలీగా కలెక్టర్ కార్యాలయం చేరుకున్నారు. టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, మంత్రి బొత్స సత్యనారాయణ సమక్షంలో సుధాకర్ నామినేషన్ పత్రాలను కలెక్టర్ మల్లికార్జునకు అందించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ పార్టీలతీతంగా, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు పారదర్శకంగా పాలన అందిస్తున్నట్లు చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానాన్ని ఈ ఎన్నికల్లో ఓట్ల రూపంలో చాటుకోవాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే లక్షలాది మంది యువతకు సచివాలయం వ్యవస్థ ద్వారా ఉపాధి కల్పించామన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు ప్రాధాన్యమిస్తున్నారని.. పట్టభద్రులు ఈ విషయాన్ని గుర్తించి పార్టీ అభ్యర్థి విజయానికి సహకరించాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ నాలుగేళ్ల ప్రభుత్వ పాలనను పట్టభద్రులకు వివరించి ఓట్లు అడుగుతామన్నారు. లబ్ధి పొందిన ప్రతీ పట్టభద్రుడు తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.


సంపత్ వినాయగర్ దేవాలయంలో పూజలు చేస్తున్న టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్,

ఆవిష్కరణల వేదిక


ప్రాజెక్టు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

- శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవాలి
- జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం: విద్యార్థులు నూతన పరిశోధనలపై దృష్టి సారించి శాస్త్ర, సాంకేతిక రంగాలలో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పిలుపునిచ్చారు. బుధవారం గుజరాతీపేటలోని ఏ.వి.ఎస్.ఎం.సి.హెచ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలు సైన్స్, సాంకేతిక రంగాల పట్ల ఆసక్తిని పెంచుతాయని చెప్పారు. సైన్స్‌మేళాలో ప్రాజెక్టులను వివరించడం ద్వారా విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చెందుతాయన్నారు. అందుబాటులోకి వచ్చిన సాంకేతికతను వినియోగించుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన వస్తువులు ఉత్పత్తి చేసే పరిశోధనలు చేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో డీఈఓ పగడాలమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రాజెక్టు నమూనా ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

రాష్ట్రస్థాయి పోటీలకు..

ఎకోఫ్రెండ్లీ మెటీరియల్: ఎల్.శ్రీజ(సవర బొంతు గిరిజన ఆశ్రమ పాఠశాల), పి.మౌనిక(పురుషోత్తపురం జెడ్పీ హైస్కూల్)
హెల్త్ అండ్ క్లీన్లీనెస్: జె.ప్రణీత(రెల్లిపేట ప్రాథమికోన్నత పాఠశాల), ఈ.పుష్ప(చింతాడ ఎంపీహెచ్ స్కూల్)
సాఫ్ట్‌వేర్ అండ్ యాప్స్: ఎస్.యశ్వంత్(శ్రీకాకుళం జీహెచ్‌ఎస్), జి.కార్తీక్(దుప్పలవలస అంబేడ్కర్ గురుకులం)
ఎన్విరాన్‌మెంటల్ అండ్ క్లైమేట్ చేంజెస్: జె.పి.రోహిత్(సోంపేట మోడల్ స్కూల్), బి.ఢిల్లేశ్వరరావు(కొత్తపేట హైస్కూల్)
మ్యాథమెటికల్ మోడలింగ్: ఐ.వెంకటేష్(పొందూరు మోడల్ స్కూల్), ఎస్.నికిత(సారవకోట కేజీబీవీ)


విద్యార్థిని తల మాత్రమే కనిపించేలా ప్రదర్శన

వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే..



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం ప్రకటించారు. ఈ మేరకు వివరాలను పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. పార్టీ ప్రతిష్టతకు, బలోపేతానికి కృషి చేయాలని, పార్టీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని సీఎం జగన్ మోహన్‌రెడ్డి సూచించినట్లు పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కో–ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి వెల్లడించారు.

విభాగం పేరు	అధ్యక్షుని పేరు	నియోజకవర్గం
యూత్	ఎం.వి.స్వరూప్	శ్రీకాకుళం
డాక్టర్స్	చింతాడ వరుణ్	టెక్కలి
మహిళా	చింతాడ మంజు	టెక్కలి
రైతు	అంబటి శ్రీనివాసరావు	శ్రీకాకుళం
బీసీసెల్	ముద్దాడ రమణమూర్తి	ఆమదాలవలస
ఎస్సీసెల్	పొన్నాడ రుషీశ్వరరావు	శ్రీకాకుళం
ఎస్టీసెల్	గురండి అప్పన్న	పాతపట్నం
మైనార్టీసెల్	మహ్మద్‌అలీబేగ్	శ్రీకాకుళం
దివ్యాంగ	అట్టాడ మురళీమోహన్‌రావు	టెక్కలి
క్రిస్టియన్	ప్రతి అన్వేష్	ఇచ్ఛాపురం
గ్రీవెన్స్‌సెల్	రొక్కం సూర్యప్రకాష్	టెక్కలి
పబ్లిసిటీ	తాడి ఆదిరెడ్డి	ఇచ్ఛాపురం
స్టూడెంట్	మార్పు పృథ్వీ	శ్రీకాకుళం
వీవర్స్	మంచు చంద్రయ్య	పాతపట్నం
వైఎస్సార్ సేవాదళ్	పతివాడ గౌరీశ్వరరావు	నరసన్నపేట
వైఎస్సార్ ట్రేడ్ యూనియన్	ఎన్ని ధనుంజయరావు	ఎచ్చెర్ల
పంచాయతీరాజ్	దమ మన్మథరావు	నరసన్నపేట
వాణిజ్యం	బెల్లాల శ్రీను	పలాస
కల్చరల్	ఉదయ్‌కుమార్ ఉప్పరపల్లి	పలాస

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉపాధి హామీ పథకం సిబ్బంది బాధ్యత రాహిత్యంగా విధులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు స్పష్టం చేశారు. బుధవారం డ్వామా కార్యాలయంలో పనుల ప్రగతిలో వెనుకబడిన మండలాల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సగటు వేతనం రూ. 250 వచ్చేలా పనులు చేయాలని పదే పదే చెబుతున్నా ఆశించిన స్థాయిలో ప్రగతి ఎందుకు లేదని ప్రశ్నించారు. సమావేశంలో ఏపీడీలు పి.రాధ, శైలజ, కె.లోకేష్, హరిత, మురళీకృష్ణ, పరిపాలనాధికారి ప్రసాదరావు, ఏపీఓలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

క్లుప్తంగా

104, 108 వాహనాలకు 5జీ సేవలు



104 వాహనంలో 5జీ సేవలను అప్‌డేట్ చేస్తున్న సిబ్బంది

టెక్కలి రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేస్తున్నారు. దానిలో భాగంగా కొత్తగా 108, 104 వాహనాలను ఏర్పాటు చేశారు. అయితే ఆ వాహనాలకు 2జీ సేవలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. దీంతో అత్యవసర సమయాల్లో సమాచారాన్ని వేగవంతంగా తెలుసుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 104, 108 వాహనాలకు 5జీ సేవలకు అప్‌గ్రేడ్ చేస్తున్నారు. బుధవారం విజయవాడ నుంచి సిస్టమ్ ఇంటిగ్రేటర్ అధికారి వెంకటేష్, జిల్లా ఐటీ సిస్టం సమీకృత అధికారి సయ్యద్ ఇబ్రహీంలు టెక్కలి జిల్లా ఆస్పత్రి పరిధిలో ఉన్న 104, 108 వాహనాలకు 5జీ సేవలను అప్‌గ్రేడ్ చేశారు. దీని ద్వారా సేవలకు సంబంధించిన సమాచారం వేగవంతంగా అందుతోందన్నారు.

సీఎం జగన్ పాలనలోనే సామాజిక న్యాయం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్
- ఎమ్మెల్సీ అభ్యర్థిగా నర్తు రామారావు ఎంపికపై సీఎంకు కృతజ్ఞతలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దేశంలోనే ఎక్కడా లేని విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు పరిపాలనలో పెద్ద ఎత్తున భాగస్వామ్యం కల్పించి సామాజిక న్యాయం చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కష్ణదాస్ అన్నారు. పార్టీ తరఫున స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నర్తు రామారావు నామినేషన్ వేసిన సందర్భంగా నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ఉదయం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శాసనమండలిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు సంబంధించి జగన్ కల్పిస్తున్న ప్రాధాన్యత ఆయా వర్గాల అభివృద్ధి పట్ల ఉన్న చిత్తశుద్ధి, దూరదృష్టిని తెలియజేస్తోందన్నారు. రామారావుకు ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించడం పట్ల జిల్లా ప్రజలు, యాదవ కులస్తుల తరఫున సీఎం జగన్‌కు కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి యాదవ సామాజిక వర్గానికి చెందిన ఆయనకు ఎమ్మెల్సీ పదవిని గతంలో ఇచ్చిన హామీ మేరకు ఇవ్వడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. మాటిస్తే ఎట్టిపరిస్థితిలో తప్పరనేందుకు నర్తు రామారావుకు అవకాశం కల్పించడమే ఇందుకు తార్కాణమన్నారు. జిల్లాలో యాదవ సామాజికవర్గం నాలుగో పెద్ద సామాజిక వర్గమని.. వారి ప్రతినిధిగా జిల్లా నుంచి చట్టసభల్లో ప్రాధాన్యత దక్కడం పెద్ద గౌరవంగా భావిస్తున్నామన్నారు. తదుపరి అవకాశం కళింగ వైశ్యులకు దక్కుతోందన్నారు. అలాగే అన్ని కులాలకు సరైన సమయంలో సరైన అవకాశం లభిస్తుందని.. ఎవ్వరూ నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని కృష్ణదాస్ భరోసానిచ్చారు. చంద్రబాబుకి బడుగు, బలహీనవర్గాల ఓట్లు, సీట్లు కావాలే తప్ప వారికి సామాజిక న్యాయం కల్పించాలన్న ఆలోచన ఎక్కడా లేదన్నారు. అంబేడ్కర్, పూలే ఆశయాలను అమలు చేస్తోన్నది సీఎం జగన్ ఒక్కరేనన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, తమ్మినేని చిరంజీవి నాగ్, ఎంపీపీ వాన గోపి, చింతు రామారావు, అంబటి శ్రీనివాసరావు, పాల వసంతరెడ్డి, రాజాపు అప్పన్న, గద్దిబోయిన కృష్ణయాదవ్ పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి అధిక వాహనాల్లో కలెక్టరేట్‌కి నర్తు రామారావు నామినేషన్‌కు పార్టీ శ్రేణులు తరలివెళ్లారు.

కూచిపూడి నృత్య పోటీల్లో కోటబొమ్మాళి వాసి ప్రతిభ



వారణాసి ఎమ్మెల్యే సూరభ్ శ్రీవాత్సవ నుంచి అవార్డు స్వీకరిస్తున్న నర్సింహరావు

కోటబొమ్మాళి: మహారాష్ట్రలోని కాశీవిశ్వేశ్వరస్వామి వారి సన్నిధిలో వాగ్దేవి విద్యా సంగీత కళా నృత్య సంస్కృతి సంస్థ వారు ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహించిన కూచిపూడి నృత్య పోటీల్లో కోటబొమ్మాళికి చెందిన శ్రీదేవి నృత్యాలయానికి చెందిన కర్రి నర్సింహరావు మంచి ప్రతిభ కనబర్చారు. ఏటా మాఘమాసంలో పోటీలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది నిర్వహించిన పోటీల్లో దేశ వ్యాప్తంగా ఏడు వందల మంది కళాకారులు పోటీపడగా నర్సింహరావు ప్రథమ స్థానంలో నిలిచి బహుమతి సొంతం చేసుకున్నారు. వారణాసి శాసనసభ్యుడు సూరభ్ శ్రీవాత్సవ చేతులమీదుగా శివ పాద నర్తన అవార్డును నర్సింహరావు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ బి.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉన్నతాధికారుల వేధింపులు ఆపాలి



ప్రధాన తపాలా శాఖ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: తపాలాశాఖలో ఆచరణ సాధ్యం కాని టార్గెట్ల పేరుతో ఉన్నతాధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని, వెంటనే వీటిని ఆపాలని ఆంధ్రప్రదేశ్ తపాలా ఉద్యోగుల సంఘాలు (ఎన్ఎఫ్‌పీఈ–ఎఫ్ఎన్‌పీవో) ప్రతినిధులు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం ప్రధాన తపాలాశాఖ కార్యాలయం వద్ద బుధవారం తపాలా ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్లుగా ప్రతి సంవత్సరం మార్చిలో టార్గెట్ల పేరుతో అధికారులు ఉద్యోగులపై ఒత్తిడి చేయడం తగదన్నారు. గత నెల 28న దేశ వ్యాప్తంగా ఒక్క రోజుకోటి కొత్త అకౌంట్లు తెరవాలని లక్ష్యాలు విధించారని, మళ్లీ ఈ నెల 9, 10 తేదీల్లో ఒక్క రోజులో 7.5 లక్షల సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు తెరవమని టార్గెట్లు విధించారన్నారు. తాజాగా ఈ నెల 20 నుంచి 24 వరకు ప్రతి పోస్టాఫీసులో 50 అకౌంట్లు తెరవాలని లక్ష్యం విధించడం దారుణమన్నారు. ఇలాంటి ఒత్తిళ్ల వల్ల ఇటీవల మచిలీపట్నంలోని పామర్రు బజారు సబ్ పోస్టుమాస్టర్ గుండెపోటుతో అకాల మరణం చెందారని చెప్పారు. ఇకనైనా వేధింపులు ఆపకపోతే మార్చి 9న విజయవాడలోని చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఆఫీసు ముట్టడి చేయాలని ఉద్యోగ సంఘాలు నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పోస్టల్ ఉద్యోగ సంఘాల నాయకులు గణపతి, బాబూరావు, జ్యోతీశ్వరరావు, వేణుగోపాలరావు, రాంబాబు, రమేష్, డిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఓబీలో చెక్‌పోస్టు ఏర్పాటు

పాతపట్నం: ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతం పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బుధవారం పోలీసులు, రెవెన్యూ అధికారులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పాతపట్నం సీఐ ఎం.వినోద్‌బాబు, ఎస్ఐ కామేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఒడిశా నుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేశారు.

మృతి చెందిన వ్యక్తి ఆచూకీ లభ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని 16వ నంబరు జాతీయ రహదారిపై తమ్మినాయుడుపేట పంచాయతీ సనపలవానిపేట సమీపంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి మృతి చెందిన వ్యక్తి ఆచూకీ తెలిసింది. మృతుని ప్యాంట్ జేబులో ఉన్న ఫోన్ నంబర్ల ఆధారంగా అతని ఆచూకీ తెలిసిందని ఎచ్చెర్ల పోలీసులు చెప్పారు. మృతినిది ఝార్ఖండ్ రాష్ట్రం కుర్దెజిసిమ్డెగ్ ప్రాంతానికి చెందిన కుజూర్ ప్రకాష్‌గా గుర్తించారు. పోలీసుల సమాచారం మేరకు బుధవారం ఇక్కడకు చేరుకున్న కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌లో భద్రపరిచిన మృతదేహాన్ని చూసి కుజూర్ ప్రకాష్‌గా గుర్తించారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించారు. స్థానికంగా ఓ పరిశ్రమలో కార్మికునిగా ప్రకాష్ పని చేస్తుండేవాడు. ఈ ప్రాంతానికి ఎందుకు వచ్చాడు, ఢీ కొట్టిన వాహనం ఏమిటన్నది తెలియ రాలేదు. ఎస్సై వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాన్ షాపులో చోరీ

టెక్కలి రూరల్: పరశురాంపురం జంక్షన్ వద్ద జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పాన్‌షాపులో బుధవారం చోరీ జరిగిందని యజమాని కంబాల రవికుమార్ తెలిపారు. బుధవారం ఉదయం షాపు తెరిచే సమయానికి అందులోని సిగరెట్లు, కూల్‌డ్రింకులతో కొంత నగదు చోరీకి గురైనట్టు గుర్తించామన్నారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు నమోదు చేశారు.

వివాహమైన ఎనిమిది నెలలకే..



తాళ్ల స్నేహ(ఫైల్)

మందస: అందమైన కలలతో జీవితాన్ని ఊహించుకున్న ఆమెకు ఏం కష్టమొచ్చిందో గానీ ఆత్మహత్య చేసుకుంది. ఆనందంగా గడపాల్సిన వయస్సులో అందని లోకాలకు వెళ్లిపోయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మందస మండలం ఉద్దాన ప్రాంతమైన దున్నవూరు పంచాయతీ కొత్తపితాళి గ్రామానికి చెందిన తాళ్ల స్నేహ(21)కు భేతాళపురం గ్రామానికి చెందిన బత్తిని విజయ్‌తో ఎనిమిది నెలల క్రితం వివాహం జరిగింది. విజయ్ నేవీలో ఉద్యోగం చేస్తూ తమిళనాడులో ఉంటున్నారు. ఇంతలో ఏమైందో గానీ స్నేహ కొత్తపితాళిలోని కన్నవారి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఊయల కొక్కేనికి చీరతో ఉరి వేసుకుంది. ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు హుటాహుటిన హరిపురం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. అప్పటికే ఆమె మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. స్నేహ తల్లి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వై.రవికుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

యువ న్యాయవాదులకు భరోసా

- జిల్లాలో 13 మందికి వైఎస్సార్ లా నేస్తం వర్తింపు



శ్రీకాకుళం పాతబస్టాండ్: యువ న్యాయవాదులు వృత్తిలో రాణించేందుకు వైఎస్సార్ లా నేస్తం ఉపకరిస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో వైఎస్సార్ లా నేస్తం పథకం లబ్ధిదారులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి మాట్లాడుతూ జిల్లాలో ఏడో విడతలో 13 మంది యువ న్యాయవాదులకు లా నేస్తం పథకం వర్తించిందన్నారు. వీరికి రూ.65,000 వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఆరు విడతల్లో 109 మంది న్యాయవాదులకు రూ.5,45,000 మేర లబ్ధి చేకూరినట్లు తెలిపారు. యువ న్యాయవాదులు కొత్తగా పుస్తకాలు కొనుగోలు, ఇతర వృత్తిపరమైన అవసరాలకు లా నేస్తం డబ్బులు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పలువురు యువ న్యాయవాదులు పాల్గొన్నారు.

మంచి ప్రోత్సాహం..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి యువ న్యాయవాదులను ప్రోత్సహిస్తున్నారు. కొత్తగా వృత్తిలోకి వచ్చిన వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని స్టైఫండ్ తరహాలో ప్రభుత్వం డబ్బులు జమ చేయడం ఆనందంగా ఉంది.

– సంపతరావు హరీష్, యువ న్యాయవాది

వృత్తిపరమైన అవసరాలకు..



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందజేస్తున్న స్టైఫండ్ ఎంతగానో ఉపయోగపడుతోంది. ప్రతి నెలా పుస్తకాలు, ఇతర వృత్తిపరమైన అవసరాలకు జూనియర్ న్యాయవాదులకు ఈ ప్రోత్సాహం ఉపకరిస్తుంది. ఎంతోమంది న్యాయవాదులకు పథకం ఉపయోగపడుతుంది.

– గురుగుబెల్లి విజయలక్ష్మి, యువ న్యాయవాది

అనుమానాస్పద పార్శిళ్ల తనిఖీ

కాశీబుగ్గ: పలాస ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని లాజిస్టిక్స్ పార్సెల్ సర్వీస్ కౌంటర్‌లో అసిస్టెంట్ మేనేజర్ పి.సంతోష్‌కుమార్ సమక్షంలో అనుమానాస్పద పార్శిళ్లను సిబ్బంది బుధవారం తనిఖీ చేశారు. అనంతరం కాంప్లెక్స్‌లో ప్రయాణికులతో మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ కోన కృష్ణారావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ డ్రగ్ ఫ్రీ రాష్ట్రంగా మార్చేందుకు చేసినటువంటి ప్రణాళికలో భాగంగా తనిఖీ చేస్తున్నామన్నారు. గంజాయి, నల్లమందు, బ్రౌన్ సుగర్, కొకైన్, కోడెక్స్ మొదలగు మాదక ద్రవ్యాలు రవాణాకు డ్రగ్స్ మాఫియా ఈ పార్శిళ్ల సర్వీసెస్‌ను ఎంచుకుని కొన్ని రకాల నిత్యావసర వస్తువుల పార్శిల్ రూపములో రహస్యముగా ఒడిశా తదితర రాష్ట్రాల నుండి ఆంధ్రప్రదేశ్‌కు సరఫరా చేస్తున్నారన్నారు. దీన్ని నివారించేందుకు ఆర్టీసీ అధికారుల సహకారంతో కృషి చేస్తున్నామన్నారు. కాశీబుగ్గ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెంటికోట, అల్లుకోల, తర్లాకోట గ్రామాల్లో విద్యార్థులకు మహిళలపై దాడులు నిరోధించాలని నాటక రూపంలో కళాబృందాలు అవగాహన కల్పించాయి.

దీనబంధుపురంలో అగ్ని ప్రమాదం

మెళియాపుట్టి: దీనబంధుపురం గ్రామంలో బుధవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఒక రేకు ఇల్లు, పశువుల శాలలు, వ్యవసాయ కోతమిషన్ దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించింది. ఘటనలో హరిపురం పున్నయ్యకు చెందిన రేకిల్లు కాలిపోవడంతోపాటు ఒకవైపు గోడకూలిపోయింది. పున్నయ్య ఇంట్లో ఆదివారం శుభకార్యం జరగాల్సి ఉంది. దీనికి కోసం తీసుకొచ్చిన బట్టలు, బియ్యం, సరుకులు, రూ.20 వేల నగదు కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు. అలాగే పక్కనే ఉన్న జన్ని సోమేష్, జన్ని సుందరమ్మ, పడాల సోమయ్యల పశువుల శాలలు, హరిపురం రామారావుకు చెందిన వ్యవసాయ కోతమిషన్ బూడిదయ్యాయి. ఆర్ఐ వైకుంఠరావు, వీఆర్వో రాజు, కార్యదర్శి శంకర్ ఘటనా స్థలాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. నష్టం అంచనావేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. గ్రామ సర్పంచ్ సవర కావేరి బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹ 170